క్లుప్తంగా

రాష్ట్ర రహదారిపై భారీ లారీ బోల్తా



నకరికల్లు: పోలీస్‌స్టేషన్ ఎదుట లారీ బోల్తాపడింది. ఈ ఘటన స్థానిక అద్దంకి– నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. చైన్నై నుంచి పంజాబ్‌కు కంటైనర్ లారీ బయలుదేరింది. మార్గంమధ్యలో డ్రైవర్ సేద తీరేందుకు క్లీనర్‌ను లారీ నడిపేందుకు ఇచ్చాడు. వేగంగా వస్తున్న లారీ పోలీస్‌స్టేషన్ సమీపంలో హైవే కంచెను ఢీకొట్టి బోల్తా పడింది. ఘటనలో లారీ పూర్తిగా ధ్వంసం కాగా పడుకొని ఉన్న డ్రైవర్ అధీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం నడుపుతున్న క్లీనర్ బీజే పాల్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. స్పందించిన పోలీసులు మూడుక్రేన్‌లను తెప్పించి వాటి సహాయంతో దాదాపు ఆరుగంటలు శ్రమంచి లారీని హైవే నుంచి పక్కకు తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.సురేష్ సోమవారం తెలిపారు.

నలంద అధ్యాపకుడికి డాక్టరేట్



సత్తెనపల్లి: మండలంలోని కంటిపూడి సమీపంలోని నలంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న త్రిపురమల్లు జగన్ మోహనరావుకు డాక్టరేట్ అందుకున్నారు. వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్(డీమ్డ్ టూ బి యూనివర్శిటీ, సేలం) వారు ఆయన సమర్పించిన పరిశోధన పత్రం 'ఆటో ఇమ్యూనో డీసీజ్ చికిత్స కోసం పాలీ హెర్బల్ ఫార్ములేషన్ అభివృద్ధి, ప్రమాణీకరణ' అనే అంశంపై పరిశోధన జరిపి పత్రాలను గైడ్ డాక్టర్ ఆర్ మార్గరేట్ చండిరా కు సమర్పించారు. గత నెల 22న కమిటీ ఆమోదం త్రిపురమల్లు జగన్ మోహనరావుకు డాక్టరేట్ ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బ్రహ్మారెడ్డి అభినందించారు.

క్రైస్తవులపై కేంద్రం వివక్ష

సత్తెనపల్లి: క్రైస్తవులపై కేంద్ర ప్రభుత్వం వివక్షతతో ఉన్నట్లు అర్థమవుతోదని నియోజకవర్గ పాస్టర్ల సంఘ అధ్యక్షులు గోళ్లమూడి సుధీర్ బాబు అన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ వద్దంటూ పాస్టర్లు, ఇద్వా సంఘ మహిళలు పట్టణంలోని తాలూకా సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూసీసీ రూపొందించటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మణిపూర్ రాష్ట్రంలో లక్షలాది మంది క్రైస్తవులపై దౌర్జన్యం జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టిపట్టనట్లు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మట్టుపల్లి చినబాబు మాట్లాడుతూ యూసీసీ అనేది లేకపోయినా 70 సంవత్సరాలు పాటు భారత దేశంలో ప్రజలందరూ బాగానే జీవించారన్నారు. యూసీసీ అవసరం భారత దేశానికి లేదన్నారు. అనంతరం ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రం సమర్పించారు.

సుపరిపాలనకు నిదర్శనం జగనన్న సురక్ష



సత్తెనపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సుపరిపాలనకు నిదర్శనమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 15వ సచివాలయం పరిధిలో ఉన్న 15,16 వార్డుల్లోని వడ్డవల్లి ఆంజనేయ స్వామి గుడి వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మొత్తం 1,445 గృహాలకు గాను 1,184 గృహాలకు సర్వే చేసి సర్వేలో 185 దరఖాస్తులకు గాను 182 సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పేరం సాంబశివరావు, 15వ వార్డు కౌన్సిలర్ గంటా రమణమ్మ, 16వ వార్డు ఇన్‌చార్జ్ నందిగామ ఆదాం, నాయకులు గంటా ఏసుబాబు,చిలుకా రమణయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సత్తెనపల్లి: పేకాటాడుతున్నారని అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. పట్టణ సీఐ శోభన్ బాబు సోమవారం తెలిపిన వివరాలు.. పట్టణంలోని కొత్త సుగాలి కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేయగా నలుగురు పేకాట రాయుళ్ళు పట్టుపడగా ఇరువురు పరారయ్యారన్నారు. పట్టుబడ్డ వారిలో క్రోసూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఒక హోంగార్డ్ ఉండగా, పరారైన ఇరువురిలో ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక హోం గార్డు ఉన్నాడన్నారు. స్థావరం వద్ద రూ.3వేలు నగదును స్వాధీనపరచుకొని పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు.

సేంద్రియ వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం

మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి

అమరావతి: సేంద్రియ వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అత్తలూరులో అత్తలూరు ఆర్గానిక్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఎండీ నూతలపాటి సురేంద్ర బాబు ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవపాయంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. సదస్సుకు వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య అధ్యక్షత వహించారు. మంత్రి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించటానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని వీటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా సమష్టిగా సాగుచేయటం, నిల్వ చేయటం, మార్కెటింగ్‌లలో శిక్షణ అందుబాటులోకి వస్తాయని వివరించారు. సమాజంలో అసలైన శాస్త్రవేత్త రైతు అని, అలాంటి రైతుకు ఉపయోగపడే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతి అని కొనియాడారు. అందుకే క్రాప్ ఇన్స్యూరెన్స్, ఈ–క్రాప్, ఆర్బీకేలు వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారానే అందుతున్నాయని వివరించారు. అందుకే రైతు భరోసా కేంద్రాలు ప్రపంచంలోనే అత్యుత్తమ చాంపియన్ అవార్డుకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు.

సబ్సిడీపై టమాటాలు..

టమాటాలు కిలో వంద రూపాయలకు కొని.. రూ.50 కే ప్రజలకు అందిస్తున్నామని మంత్రి గోవర్ధనరెడ్డి చెప్పారు. పంటలను రైతులు నష్టానికి అమ్ముకోకుండా మార్కెటింగ్ శాఖ కృషి చేస్తోందని వివరించారు. స్వయం సహాయక బందాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అత్తలూరు ప్రాంతం సేంద్రియ వ్యవసాయానికి కేంద్రంగా మారిందని చెప్పారు. తొలుత అత్తలూరులోని ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. అవగాహన సదస్సు అనంతరం కిసాన్ క్రెడిట్ కార్డులకు సంబంధించి 3,671 రైతులకు రూ.57.61 కోట్లు అందజేశారు. అలాగే నియోజకవర్గంలోని 194 గ్రూపులకు సంబంధించి రరూ.22.27 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. సదస్సులో నాబార్డ్ జీఎం మూర్తి, చైతన్య గోదావరి బ్యాంక్ చైర్మన్ కామేశ్వరరావు, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారి మురళి, జిల్లా ఉద్యానశాఖాధికారి బెన్నీ, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి ప్రసంగించారు. కార్యక్రమంలో జీడీసీసీ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ మేకల హనుమంతరావు, జెడ్పీటీసీ కరుణకుమారి, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎ.శ్రీనివాసరెడ్డి, వెంపా వాసు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం



ముప్పాళ్లలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

ముప్పాళ్ల: సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సత్తెనపల్లి– నరసరావుపేట ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటర్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరసనలో భాగంగా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.భవానీశంకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, నక్కా శ్రీనివాసరావు, పీలా లక్ష్మణ్, వలంటీర్లు హుసేన్, రామలింగారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు: వలంటీర్లను పవన్‌కళ్యాణ్ కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండలంలోని వలంటీర్లు సోమవారం నిరసన తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, ఎస్ఐ పి.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. వై జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటుచేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత దిష్టిబొమ్మకు చెప్పుల దండవేసి ఊరేగించారు. తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పి వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుసేబీ బాషా, ఉపసర్పంచి కంఠమనేని చందు, పాశం పాపిరెడ్డి, చల్లగుండ్ల సర్పంచి, ఎంపీటీసీలు అరవా ఆదిలక్ష్మినాగేశ్వరరావు, కోటిరెడ్డి, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, సలీల్, మారెళ్ల శ్రీనివాసరావు, పరసా సాంబయ్య పాల్గొన్నారు.

వలంటీర్లతో పెట్టుకుంటే ఉరుకోం..

రాజుపాలెం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఏలూరులో గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మానవహారంగా ఏర్పడి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ మాతో పెట్టుకుంటే ఆంధ్రాలో కూడా తిరగనియ్యమని హెచ్చరించారు. ఆందోళనకు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్, సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర పాలవాయి ఆదినారాయణ, మద్దతు తెలిపారు.

రెడ్డిగూడెంలో దిష్టిబొమ్మ దహనం

మండలంలోని రెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లో మాచర్ల– గుంటూరు రహదారిపై పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామ వలంటీర్లకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



నకరికల్లులో ఎస్ఐ పి.సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు



రాజుపాలెంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పవనకళ్యాణ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు

- ఆరోపణలపై వెల్లువెత్తిన నిరసనలు
- ఆర్టీసీ బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ, ధర్నా



సత్తెనపల్లిలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలపై వలంటీర్లు భగ్గుమన్నారు. తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఆరోపణలు ఖండిస్తున్నామని ముక్తకంఠంతో ప్రకటించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థకు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే సహించేది లేదంటూ హెచ్చరించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్ రెసిడెన్సిలో ఏలూరులో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై చేసిన ఆరోపణలకు నిరసనగా సోమవారం వలంటీర్లు సమావేశం నిర్వహించారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ వరకు చేరుకొని అక్కడ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణం, సత్తెనపల్లి రూరల్‌కు చెందిన వలంటీర్లు, మున్సిపల్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణ, రూరల్ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణ చేస్తే సహించేది లేదు



'పవన్ కళ్యాణ్ నాకు కొంచెం తిక్కుంది అని' అప్పుడప్పుడు మాట్లాడుతుంటారు. ఆ తిక్క నిన్న ఏలూరులో నిరూపితమైంది. ఆ తిక్క సరిచేసుకోకపోతే రోడ్లపై తిరగనివ్వం. సేవా సైన్యంపై ఆరోపణ చేస్తే సహించేది లేదు. తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– ఫణిదరపు అశోక్, వలంటీర్, 20వ వార్డు

క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర బహిష్కరణ



ఓ పనికిమాలిన వాడు స్క్రిప్ట్ రాసిస్తే ఈ తిక్కలోడు ఏది పడితే అది మాట్లాడుతున్నాడు. ఖబడ్దార్ పవన్ కళ్యాణ్ తక్షణమే వలంటీర్ల వ్యవస్థకు క్షమాపణ చెప్పకపోతే నిన్ను రాష్ట్రం నుంచి బహిష్కరిస్తాం.

– కస్తల అశోక్ కుమార్, వలంటీర్, 23వ వార్డు

పవన్ వ్యాఖ్యలకు సిగ్గుపడుతున్నా



కరోనా సమయములో బంధువులు సైతం కరోనా బాధితులని వదిలేసి వెళ్తే ప్రాణాలకు తెగించి వారికి సేవలు అందించాం. నేను పవన్ కళ్యాణ్ సామాజిక వర్గమే. నిజాయితీగా పనిచేస్తున్న మా వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలకు సిగ్గుపడుతున్నా.

–పొందుగల లక్ష్మీ ప్రసన్న, వలంటీర్, కొత్తపేట

వారాహిని వీధుల్లోకి రానివ్వం



కేవలం రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటూ పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నాం. సేవా దృక్పథంతో పని చేసే వలంటీర్లపై చులకనగా మాట్లాడితే జాగ్రత్త పవన్ కళ్యాణ్. వారాహిని వీధుల్లోకి రానివ్వం. బేషరతుగా వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి.

–నల్లగట్ల ఆదిలక్ష్మి, వలంటీర్

అచ్చంపేటలో భారీ వర్షం

అచ్చంపేట: తెల్లవారుజాము నుంచే మండల వ్యాప్తంగా కుండపోత వర్షం పడింది. వర్షంతో పత్తి విత్తనాలు వేసేందుంకు రైతులు దుక్కి దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అచ్చంపేటలోని లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. విద్యుత్ సబ్ స్టేషన్, కోగంటివారిపాలెంలో నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ చుట్టూ నీళ్ల చేరాయి.

బీఎల్వోల సమావేశం

సత్తెనపల్లి: మండల పరిధిలో ఒకే డోర్ నెంబర్‌లో 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే, ఆ డోర్ నెంబర్‌లో అంతమంది ఓటర్లు ఉన్నారా? లేదా అని పరిశీలించి నివేదిక రూపొందించాలని సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ చెప్పారు. పట్టణంలో సోమవారం మండలంలోని బూత్‌స్థాయి అధికారులతో ఎస్ఎస్ఆర్–2024 సంబంధించి రివిజన్ కార్యక్రమాలు, డోర్ టు డోర్ విజిట్ కార్యక్రమాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సాంఘిక బహిష్కరణకు గురైన వారికి పరిహారం ఇవ్వాలని రాస్తారోకో

సత్తెనపల్లి: మండలంలోని పెద్దమక్కెనలో సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులకు పరిహారం అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టుపల్లి చినబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి హైవేపై సోమవారం బాధితులతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భం గా చినబాబు మాట్లాడుతూ బాధితులందరూ తహసీల్దార్‌ను కలిసి 62 రోజులుగా దీక్షలు చేస్తుంటే ఇంతవరకు ఏ ఒక్క అధికారి కూడా ఎందుకు సందర్శించలేదని నిలదీశారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ బాధితులకి నష్టపరిహారాలు, వ్యవసాయ భూములు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నెలన్నర అవుతున్న ఇంతవరకు ఎటువంటి స్పందన లేదని ఆందోళన వెలిబుచ్చారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచి పోవడంతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు హుటా హుటిన వచ్చి రాస్తారోకోను విరమింపజేశారు.

దాడి కేసులో ఆరుగురిపై కేసు నమోదు

సత్తెనపల్లి: భార్యాభర్తలపై దాడి ఘటన కేసులో ఆరుగురుపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పట్టణ సీఐ యు.శోభన్ బాబు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రఘురాంనగర్‌లో ఐదు పోర్షన్ల గృహంలో ఒకటో పోర్షనలో సత్తెనపల్లి మండలం గోగులపాడు సర్పంచి గుంజి భూలక్ష్మి, భర్త విజయ్ కుమార్ అద్దెకు నివసిస్తున్నారన్నారు. నాలుగో పోర్షన్‌లో ఎలక్ట్రికల్, ఏసీ మెకానిక్ పిచ్చాల పున్నారెడ్డి, ఆయన భార్య రుక్మిణి దంపతులు నివసిస్తున్నారు. ఒకటో పోర్షన్ వద్ద నీటి సంపు ఉండడంతో అక్కడ నీటిని పట్టుకునే విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగ్గాయన్నారు. ఈ క్రమంలో సర్పంచి భూలక్ష్మి దూషించడంతో తిరిగి పున్నారెడ్డి కూడా దూషించాడన్నారు. దీంతో సర్పంచి, ఆమె భర్త విజయ్ కుమార్, తమ్ముడు, ఆయన భార్య, చెల్లెలు, ఆమె భర్త కలిసి పున్నారెడ్డి, రుక్మిణీ దంపతుల దాడి చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు భూలక్ష్మి, విజయ్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం



కండ్లకుంటలో అర్హత పత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

నకరికల్లు: జగనన్న సురక్షతో అర్హులకు మేలు అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని కండ్లకుంటలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఉపసర్పంచి కంఠమనేని చందు, తహసీల్దార్ నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బక్కా మేరీ, కంఠమనేని కోటయ్య, చట్టి అప్పయ్య, గాలి చంద్రయ్య, జంపని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టాలి



బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్‌లకు సూచనలిస్తున్న నకరికల్లు తహసీల్దార్ నగేష్

నకరికల్లు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణను తప్పులతడకలు లేకుండా చేపట్టాలని తహసీల్దార్ నగేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్‌లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీరో డోర్ నంబర్ ఉన్న ఓటరు వివరాలు, వందేళ్లు పైబడిన ఓటర్లు, ఒకే డోర్ నంబర్‌పై 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు నమోదైనట్లు సవరణ దరఖాస్తులో దాఖలు చేయాలన్నారు. ఇంటింటికి సర్వేచేసి 2024 జనవరి ఒకటి నాటికి 18ఏళ్లు నిండిన యువతీయువకులను గుర్తించి వారికి ఓటు హక్కు నమోదు కోసం ఫారం–6 పూర్తి చేయించాలని అన్నారు. ఓటరు జాబితాలో తప్పొప్పులు సవరించేందుకు ఫారం–8ను పూరించాలన్నారు. మరణించిన ఓటర్లకు సంబంధించి కుటుంబ సభ్యులతో ఫారం–7 పూర్తిచేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ సీహెచ్ యువరాజ్, సీనియర్ అసిస్టెంట్ గోపు రాజారెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ కృషి

క్రోసూరు: గుడ్‌షెపర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం క్రోసూరు సచివాలయం –1 వద్ద బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి బాలల రక్షణ కమిటీ సభ్యులు సిస్టర్ విన్నరసి సారథ్యంలో సభ్యుడు బాబూరావు మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సంత్రూనాయక్, గుడ్‌షెపర్డ్ సిబ్బంది లలితా కుమారి పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

సత్తెనపల్లి: పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్లు, ఏరియా వైద్యశాలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా చెకప్‌ల నిమిత్తం సోమవారం హాజరైన గర్భిణులకు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబా సేవా సమాజం సహకారంతో పౌష్టికాహారంతో కూడిన అన్నసంతర్పణ నిర్వహించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లకు, ఏరియా వైద్యశాలకు నెలకొకసారి హెల్త్ చెక్ చేయించుకోవడానికి ఎక్కువ మంది వస్తున్నందును వారికి అన్నసంతర్పణ చేయాలని హెల్త్ విజిటర్ ప్రేమ్ కుమారి అభ్యర్థన మేరకు వస్తారు వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్తా రామకృష్ణ స్పందించి షిరిడి సాయిబాబా సేవా సమాజం సాయం కోరారు. కార్యక్రమంలో యూపీ హెచ్ఎస్‌సీ వైద్యులు డాక్టర్ ధర్మ, సాయిబాబా దేవాలయ ట్రెజరర్ వెల్నాటి వెంకటేశ్వర రావు, జాయింట్ సెక్రెటరీ గడ్డం శంకరరావు, పెద్దింటి నాగేశ్వరరావు, కనమర్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు ఎవ్వరూ ఉండకూడదు

సత్తెనపల్లి: బడి బయట పిల్లలు ఎవ్వరూ ఉండకూడదని అందుకు అన్ని విద్యాసంస్థలు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి సుధాకరరావు అన్నారు. పట్టణంలోని వేద కళాశాలలో ఈవిద్యా సంవత్సరం చేరిక వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇంటర్ చదివే విధంగా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటికే కళాశాలలో చేరిన వారి వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు చేరిన విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారి ఏ శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణతో కలసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. కళాశాల డైరెక్టర్ చింతాడ రమేష్, కళాశాల ప్రన్సిపాల్ సరిత లు అధికారులకు వివరాలు అందజేశారు.

ఆర్థిక సాయం

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో అనారోగ్యంగా ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కుంకలగుంట ఎస్‌కే కరిముల్లాకు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం సోమవారం అందించారు. మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, సర్పంచి పులిబండ్ల అశోక్, ఎస్‌కే బాషా, ఎస్‌కే జానీ, ఎస్‌కే సుభాని, వెంకటరెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తల్లిదండ్రులు, పెద్దలు

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం లోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు అద్దంకి రాంబాబు, ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, సైదా బదిలీపై వెళ్లారు. హాజరైన ఎంఈఓ బాల సుందరరావు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను గుర్తుంచుకుని సత్కరించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దేసు మల్లీశ్వరి బ్రహ్మం, ఎంపీటీసీ చిట్టెంశెట్టి శివనాగమణి, పాఠశాల చైర్మన్ కొలగాని వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్ నందనమూడి వెంకటేశ్వరరావు, మేశం యలమందరావు, చందు కోటేశ్వరరావు, హెచ్ఎం బలరాం నాయక్, నాగలక్ష్మి, అరుణకుమారి, అల్లాభి, స్వాతి పాల్గొన్నారు.